యథేచ్ఛగా నీటి దందా



సామనగర్‌లో బోరు నీటిని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు..అందులో నుంచి ట్యాంకర్ నింపుతున్న దృశ్యం

- వేల అడుగుల లోతులో బోర్ల తవ్వకాలు
- ఆపై ట్యాంకర్ల ద్వారా అక్రమ నీటి విక్రయం
- 'వాల్టా' నిబంధనల ఉల్లంఘన
- పట్టించుకోని అధికారులు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ కొందరు యథేచ్ఛగా వేల అడుగుల లోతులో బోరులు తవ్వుతున్నారు. వాటిలో నీరు పడితే ఒక్కో బోరు నుంచి రోజుకు వంద ట్యాంకర్ల వరకు నీటిని తోడి అమ్ముకుంటూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోపోవడం, పరోక్షంగా అక్రమార్కులకు సహకరించడంతో అక్రమ నీటి దందా 3 బోర్లు...60 ట్యాంకర్లు అన్నట్టుగా సాగుతోందని స్థానికులు అంటున్నారు.


నీటిని సరఫరా చేసే ప్రైవేట్ ట్యాంకర్

- ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో ఇక్కడికి వలసలు పెరిగాయి. పెరుగుతున్న జనాభాతో నీటి అవసరాలూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఎండా కాలం కావడంతో స్థానికులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.
- జలమండలి అధికారులు ప్రజల అవసరాలకు తగ్గట్టుగా నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. ఇదే అదనుగా కొందరు నీటి వ్యాపారం కొనసాగిస్తున్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సామనగర్, సాగర్ కాంప్లెక్స్ ప్రాంతాలలో, హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో కొందరు నీటి వ్యాపారులు అక్రమంగా వేల అడుగుల లోతులో బోర్లను తవ్వి ఆ నీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు...

వాల్టా చట్టం ప్రకారం 700 అడుగుల లోతు లోపు బోర్లు వేసి సొంత అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలి. అంతకు మించి లోతు బోర్లు తవ్వరాదు. ఈ నిబంధనకు విరుద్ధంగా నీటి వ్యాపారులు 1000 నుంచి 2000 అడుగుల లోతు వరకు బోర్లు వేసి నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. దీంతో పరిసరాల్లో తక్కువ లోతులో ఉన్న బోర్లకు నీరు అందక ఆ ప్రాంతంలో నివాసం ఉండేవారు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడి భూగర్భ జలాల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

24 గంటలూ తోడేస్తున్నారు

సామనగర్, పరిసర ప్రాంతాలలో బోరు బావుల నుంచి 24 గంటలూ నీటిని తోడేస్తున్నారు. 1500 ఫీట్ల లోతు మేర బోరులు తవ్వుతూ ఆ తర్వాత ట్యాంకర్ల ద్వారా నీటి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇష్టానుసారంగా నీటిని తోడుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి చిన్న చిన్న బోర్లు ఎండిపోతున్నాయి. బోరు బావుల తవ్వకాలు, నీటి అమ్మకంపై ప్రభుత్వ యంత్రాంగం నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

– కేఎల్ నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి, శారదానగర్

ఆ కాలేజీలపై చర్యలు తీసుకోండి: ఏఐఎస్ఎఫ్


ఫిర్యాదు కాపీని చూపిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నాగోలు: వేసవి కాలంలో నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, కాంతికుమార్ గురువారం ఇంటర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఇంటర్ బోర్డు గత వారం ఇంటర్ కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించిందని, అయితే, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మాదాపూర్ అయ్యప్ప సొసైటీ, ఎల్‌బీ నగర్, దిల్‌సుఖ్ నగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ మెట్టు, ఆదిభట్లలోని నారాయణ, శ్రీ చైతన్య, వశిష్ట, ఎస్ఆర్, రీజనెన్స్, ఆకాశ్, నానో వంటి కార్పొరేట్, ఇతర ప్రైవేట్ కళాశాలల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. కళాశాలల్లో ఇంటర్ రెండో సంవత్సరం తరగతులు బోధిస్తూ తరగతులకు హాజరు కాకపోతే టీసీలు ఇస్తామని విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఆయా కళాశాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ వర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో పేద జంటకు పెళ్లి


వధూవరులను ఆశీర్వదిస్తున్న మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా తదితరులు

చైతన్యపురి: మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో సందీప్, సుమన అనే పేద జంటకు గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్ర సత్యనారాయణ స్వామి ఆలయంలో ఘనంగా వివాహం జరిపించారు. పెళ్లికి అవసరమైన పుస్తెలు, మెట్టెలు, దుస్తులు అందజేయడంతో పాటు ఇరువురి కుటుంబ సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేశారు. పుస్తె, మెట్టెలు చీదర రమేష్, భోజనాల ఖర్చులు పలిగిల్ల బాపురాజు కుమారుడు రమేష్ అందజేశారని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి ముగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ఈటల రాజేందర్ సతీమణి జమున, మహేష్ తిరుమల, తోట రంగయ్య, శిలా కాశీనాథ్, ఎర్రం కృష్ణమూర్తి, రామిని విజయ్, చంద్రమౌళి, యువసేన సభ్యులు సత్యనారాయణ, రాఘవరెడ్డి, రాజన్న, శ్రవణ్, సాయి పాల్గొన్నారు.

తాగునీరు రోడ్డు పాలు

– పట్టించుకోని అధికారులు


మన్సూరాబాద్ అయ్యప్ప ఆలయం వద్ద రోడ్డుపై పారుతున్న తాగునీరు

మన్సూరాబాద్: వేసవి కారణంగా కాలనీలు, బస్తీల్లోని ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే ..మరోవైపు జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో మంచినీరు రోడ్డు పాలవుతోంది. మన్సూరాబాద్ అయ్యప్ప ఆలయం వద్ద, సహారాస్టేట్స్ కాలనీ ప్రధానగేట్ వద్ద తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి నీరు రోడ్డుపై వృథాగా పోతోంది. అయ్యప్ప ఆలయం నుంచి మన్సూరాబాద్ చౌరస్తా మీదుగా నీరు రోడ్డుపై పారుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా సహారా స్టేట్స్ కాలనీ రోడ్డు పూర్తిగా జలమయం అవుతోంది. వారం రోజులుగా మంచినీరు లీకేజీ అవుతోందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడలేదని స్థానికులు వాపోతున్నారు. జలమండలి ఉన్నతాధికారులు స్పందించి లీకేజీలను అరికట్టి ఎంతో విలువైన నీరు వృథా కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



5కే రన్ నిర్వహిస్తున్న ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులు

ఎల్‌బీనగర్: ఓటరు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచి ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు వరకు గురువారం 5కే రన్ నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేసి భవిష్యత్‌ను నిర్ణయిద్దామంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదిలాంటిదని ఆయన అన్నారు. ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పోలింగ్ శాతం పెంచేందుకు ఈ 5కే రన్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్కిళ్ల డీసీలు యాదయ్య, జకియా సుల్తానా, సుజాతాతో పాటు ట్రాఫిక్ పోలీసులు, సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవను కర్తవ్యంగా భావించాలి


కారుణ్య సింధు ఆశ్రమంలో హోమంలో పాల్గొన్న నిర్వాహకులు

సైదాబాద్: సామాజిక సేవను జాలిగానో, దయగానే కాకుండా అది మన కర్తవ్యంగా భావించాలని విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ సహ సంఘటన మంత్రి వినాయక్‌రావ్ దేశ్‌పాండే అన్నారు. ఆపద కాలంలో మన రక్త సంబంధీకులకు ఎలా అండగా ఉంటామో... అదే విధంగా సమాజంలోని దీనుల విషయంలోనూ ప్రేమ చూపాలని ఆయన అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కరుణశ్రీ సేవాసమితి వారి కారుణ్య సింధు అరక్షిత బాలుర ఆశ్రమం రజతోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు హోమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వినాయక్‌రావ్ దేశ్‌పాండే ఆశ్రమంలో అదనంగా నిర్మించిన అంతస్తులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఆరు వేల సేవా ప్రకల్పాల ద్వారా వీహెచ్‌పీ సమాజానికి సేవ చేస్తున్నదని తెలిపారు. కారుణ్య సింధు ఆశ్రమంలోని బాలురకు విద్యాబోధన, ఉద్యోగాల కల్పనతో పాటు ఉపాధి అవకాశాలపై అవగాహన, పలు చేతి వృత్తుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షుడు కడారి సత్యమూర్తి, కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు, వీహెచ్‌పీ నాయకులు సత్యం, నరసింహ మూర్తి, పండరీనాథ్, బండారి రమేష్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి


చైతన్యపురిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

చైతన్యపురి: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తాయని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని గురువారం డివిజన్‌లోని శివాజీచౌక్, సాయినగర్, చైతన్యపురి ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కేంద్ర పథకాలు, అభివృద్ధిపై ప్లకార్డులు, కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. నాయకులు రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్, వేణుగోపాల్‌చారి, వెంకన్న, రామ్మోహన్, రాజు, భాగ్యక్క, యశోద, విష్ణు, మహేష్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు సీఎంకు ఆహ్వానం


సీఎం రేవంత్‌రెడ్డిని విందుకు ఆహ్వానిస్తున్న షేక్ అక్బర్

సైదాబాద్: మలక్‌పేటలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరు కావాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ అక్బర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందజేశారు. గురువారం సీఎంను కలిసిన షేక్ అక్బర్ రంజాన్ మాసంలోని ఆఖరి శుక్రవారం మలక్‌పేటలోని సిమ్లా గార్డెన్‌లో భారీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని అక్బర్ సీఎంకు తెలిపారు. తమ ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి విందుకు హాజరవుతానని చెప్పారని ఆయన తెలిపారు. ఈ ఇఫ్తార్ విందుకు మంత్రులు, మైనారిటీ ముఖ్య నాయకులు, మలక్‌పేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని ఆయన తెలిపారు.

కనుల పండువగా ధన్వంతరి విగ్రహ ప్రతిష్ఠాపన

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధి వినాయకనగర్ కాలనీలోని వివేకానంద మెడికల్ సెంటర్‌లో గురువారం ఉద యం ధన్వంతరి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కనుల పండువగా జరిగింది. భారతీయం చైర్మ న్ డాక్టర్ గొల్లూరి రమేష్‌సాగర్ ఆధ్వర్యంలో తిరుప్పావై కేసరి కిషోర స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీసీతారాంజనేయస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు తిరుమల శ్రీనివాసాచార్యుల సహకారంతో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులు ధన్వంతరిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గొల్లూరి గణేష్ సాగర్, అరుణ్‌సాగర్, నర్సింహ, సమీప కాలనీలవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నాగోలు: తలకు గాయాలతో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎల్‌బీ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్‌బీనగర్‌లోని కామినేని ఎక్స్ రోడ్డు వద్ద 40 ఏళ్ల ఓ మహిళ తలకు గాయాలతో చనిపోయి ఉందని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి పేరు అరుణ అని, ఆమెకు శివాని అనే 9 ఏళ్ల కుమార్తె ఉందని విచారణలో పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ఇంటి పన్ను చెల్లింపులో రాయితీ

బడంగ్‌పేట్: బడంగ్‌పేట నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చి రాయితీ కల్పించనుంది. 2024–25 సంవత్సరానికి గాను ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ ప్రకటించింది. ఈ అవకాశాన్ని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. రఘు కోరారు. బకాయిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు.

శారదానగర్ అభివృద్ధికి చర్యలు


కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: శారదానగర్ కాలనీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల కోరిక మేరకు ఆయన గురువారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ కాలనీలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న కాలనీ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తును ఆయన పరిశీలించారు. సీనియర్ సిటిజెన్స్ కోసం కింది అంతస్తులో వసతులు కల్పించాలని, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, పార్క్ ప్రహరీ ఎత్తును పెంచాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఎన్నికల అనంతరం పనులు చేపడతామని సుధీర్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. నాయకులు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, భాస్కర్‌సాగర్, కాలనీవాసులు కేఎల్ నర్సింహారావు, సుబ్బారెడ్డి, సుధాకర్, ఇందిర, అరుణ, శ్రీనివాసరావు, రాఖీగౌడ్, హనుమంత రావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి


మోహన్‌నగర్‌లో సరఫరా అవుతున్న కలుషిత నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్

నాగోలు: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో తాగునీటిలో డ్రైనేజీ నీరు కలవడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని, సమస్య మళ్లీ తలెత్తకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. మోహన్‌నగర్‌లో కలుషిత నీరు సరఫరా అవుతోందని, ఈ సమస్యను అధికారులు అసలు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు గురువారం కార్పొరేటర్‌ను కలిసి తెలిపారు. వెంటనే ఆయన మోహన్‌నగర్‌లోని రోడ్ నెంబర్ 3,4ల్లో పర్యటించి కలుషిత నీటి సమస్యను పరిశీలించారు. జలమండలి జనరల్ మేనేజర్, మేనేజర్‌లతో మాట్లాడి వెంటనే మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మోహన్‌నగర్ బస్తీ, సత్యనగర్ కాలనీలోను ఇదే పరిస్థితి నెలకొందని, అక్కడ కూడా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాంరెడ్డి, అనిల్ కుమార్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

స్టీల్‌బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్పుపై టెక్నికల్ సర్వే

–జీహెచ్ఎంసీ ఎస్ఈ దత్తోపంత్


ఆలయ పరిరక్షణ సమితి సభ్యులతో చర్చిస్తున్న ఎస్ఈ దత్తోపంత్

సైదాబాద్: సైదాబాద్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్పుపై టెక్నికల్ అధికారులతో సర్వే చేయించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని జీహెచ్ఎంసీ ఎస్ఈ దత్తోపంత్ తెలిపారు. మార్పుపై నిర్ణయం తీసుకునే వరకు సైదాబాద్ రహదారిపై 16వ నెంబర్ పిల్లర్ నుంచి 21 వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆయన ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. మలక్‌పేట ఫైర్‌స్టేషన్ నుంచి సంతోష్‌నగర్ చౌరస్తా వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి సైదాబాద్ రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం మీదుగా వెళ్లడాన్ని తప్పుపడుతూ భక్తులు, ఆలయ పరిరక్షణ సమితి, బీజేపీ నాయకులు పలు రకాలుగా నిరసనలు చేపట్టిన విషయం విదితమే. దాంతో ఆయన ప్రాజెక్ట్ అధికారులతో కలిసి గురువారం ఆలయ ఆవరణలో సమితి సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జీహెచ్ఎంసీ ఎలాంటి పనులు చేపట్టదని అన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా అలైన్‌మెంట్ మార్పు విషయమై వచ్చిన వినతులను పరిశీలిస్తామన్నారు. సమావేశంలో ప్రాజెక్ట్ అధికారులు ఈఈ గోపాల్, డీఈ సంధ్య, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, వినయ్‌కిషోర్ యాదవ్, నిరంజన్, చవ్వ మహేష్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

బడంగ్‌పేట్: మహిళా సాధికారత కోసం దేశ ప్రధాని నరేంద్రమోదీ అహర్నిషలు కృషి చేస్తున్నారని కమలం గుర్తుకు ఓటేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కొండా సంగీత ఓటర్లను అభ్యర్థించారు. గురువారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 31వ డివిజన్‌లో బాలాజీనగర్ కాలనీలోని మహిళా సంఘాలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సంగీతరెడ్డి మాట్లాడుతూ, నరేంద్ర మోదీ పాలన మహిళలకు అండగా ఉందని, అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా, చేవేళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌లో తన భర్త మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ నుంచి పోటీలో ఉన్నారన్నారు. మీ అమూల్యమైన ఓటును కమలం గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. చేవేళ్ల అభివృద్ధి జరగాలంటే కొండా విశ్వేశ్వర్ రెడ్డితోనే సాధ్యమన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేశ్, సరోజ, కావ్య, మహాలక్ష్మి, స్వప్న, కాలనీ అధ్యక్షుడు శ్రవణ్, సంగీతశర్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 17, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 28, క్యాబేజీ 18, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 23, దొండ 18–23, చిక్కుడు 35–50, గోకర 28, బీట్‌రూట్ 23. క్యాప్సికం 65, ఆలు 33, దోస 18, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 35.శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నేడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్‌లో నేడు (శుక్రవారం) డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహిస్తామని నిర్వాహకులు ఆడాల రమేష్, కొంగరి నర్సింహారావు తెలిపారు. డా. బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఎల్‌బీనగర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, దళిత సంఘాల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యతోపాటు వైజ్ఞానిక పోటీలూ అవసరమే...


శ్రీగౌరిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు విద్యతోపాటు ఆట పాటలు, వైజ్ఞానిక పోటీలు ఎంతో అవసరమని నారాయణ స్కూల్ దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచి ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయంగా నిర్వహించిన 'నేషనల్ స్పేస్ సొసైటీ–స్పేస్ సెటిల్మెంట్' పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని శ్రీగౌరికి 'హానరబుల్ ప్రైజ్' వచ్చిందని ఆయన వెల్లడించారు. తాము విద్యార్థులను చదువులోనే కాకుండా ఇతర పోటీ పరీక్షలు, సైన్స్ ఫెయిర్లు, ఆటల పోటీల్లోనూ ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని శ్రీగౌరిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమాంబర్, ఆర్ అండ్ డీ శివరంజని, మహేశ్వరి, ఆర్ఐ రవిప్రసాద్, రఫీక్, గాయత్రి పాల్గొన్నారు.

జన జాతర సభను విజయవంతం చేయండి

తుక్కుగూడ: తుక్కుగూడలో శనివారం నిర్వహించనున్న కాంగ్రెస్ జన జాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గోగికర్ జానకీరామ్, జిల్లా నాయకుడు బంటు ధనంజయ్‌లు పిలుపునిచ్చారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ప్రజా సంక్షేమం కోసం ఐదు గ్యారంటీలను ఈ సభలో ప్రకటించనున్నారని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ హాజరవుతారన్నారు. ఈ సభకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కందుకూరు: తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించనున్న జన జాతర బహిరంగ సభను విజయవంతం చేసేలా కార్యకర్తలు, శ్రేణులు తరలి రావాలని మండల కో ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వారు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని ఆదిత్యానగర్ కాలనీలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం వైభంగా జరిగింది. అనంతరం మహాకుంభ ప్రోక్షణ, శాంతి కల్యాణం నిర్వహించారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీలలితా సొసైటీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌చే కర్ణాటక సంగీత గాత్ర కచేరీ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ సంతోషికుమారి, టి.మోహన్‌రెడ్డి, రవికుమార్, సిద్దగోని జగదీష్‌గౌడ్, జీకే గుప్తా, నాగరాజు, మూర్తి పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, బలిహరణ కుంభ నివేదన నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, త్రిదండి అస్త్రాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి, కౌన్సిలర్లు మంగమ్మ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేశారు.